క్లుప్తంగా

వెంకన్న సేవలో కోటకొండవాసులు



నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండ గ్రామానికి చెందిన మారుతి భజన మండలి సభ్యులు గతవారం రోజులుగా తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి సన్నిధిలో అఖండ హరినామ సంకీర్తనలో పాల్గొన్నారు. పదేళ్లుగా వరుసగా తిరుమలకు వెళ్లి స్వామివారి సన్నిధిలో భజనలు చేయడంతోపాటు పలు సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్నారు. ఏడాదిలో ఒకసారి స్వామివారి సేవా చేపట్టాలనే సంకల్పంతో ఏటా వెళ్తున్నట్లు వారు తెలిపారు. ఇక్కడ సేవా చేయడం పూర్వజన్మ సుకృతమని అన్నారు. కార్యక్రమంలో వెంకటయ్య, నారాయణ, చిట్టిబాబు, సురేష్, కిషన్‌బాబు, రాజు, రాములు, కాశప్ప, వెంకటయ్య పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మద్దూరు: ప్రభుత్వం చేపట్టినా రూ.2 లక్షల రుణమాఫీలో భాగంగా ఇప్పటివరకు రూ.1.5 లక్షల రుణమాఫీ చేసింది. మాఫీ అయిన రైతులు మళ్లీ కొత్త రుణాలకోసం దరఖాస్తు చేసుకోవాలని పీఏసీఎస్ దమ్‌గాన్‌పూర్ అధ్యక్షుడు గూళ్ల నర్సింహ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సొసైటీ పరిధిలో లక్ష లోపు ఉన్న రైతులు 315మందికి రూ. కోటి 30లక్షల76వేల 546 రూపాయాలు, రూ.1.5లక్షల లోపు మాఫీ అయిన రైతుల సంఖ్య146 మందికి రూ. కోటి 7లక్షల2వేల 696 రూపాయాల మాఫీ వచ్చిందని వీరందరికి మళ్లీ రుణం కావాలంటే ఆర్‌ఓఆర్, పహణీ, నోడ్యూస్, ఈసీ పత్రాలు తీసుకొని పీఏసీఎస్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేసినా సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

కస్తుర్బాకు మైక్‌సెట్ వితరణ



మక్తల్: మండలంలోని సంగంబండ వద్ద ఉన్న కస్తుర్బాగాంధీ పాఠశాలకు మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, వ్యాపారస్తుడు రాములు తమ సొంత ఖర్చుతో మైక్‌సెట్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ రాధికకు బుధవారం అందజేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరిక మేరకు పాఠశాలకు అందజేసినట్లు తెలిపారు. దాదాపు దీని విలువ రూ. 25వేల వరకు ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్‌రెడ్డి, చందపూర్, మాజీ సర్పంచ్ రాములు, ఉద్యమకారుడు నీలప్ప తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటలకు దరఖాస్తుల ఆహ్వానం

ఊట్కూరు: ఉపాధిహామీ పథకంలో ఆసక్తి ఉన్న చిన్న సన్నకారు రైతులు పండ్ల పెంపకానికి దరఖాస్తు చేసుకోవచ్చని బుధవారం ఎంపీడీఓ ధనుంజయగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. మామిడి, బత్తాయి, నిమ్మ, మునగ, ఈత తదితర పండ్లతోటలను ఉపాధిహామీ పథకంలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. బోరుబావి నీటివసతి ఉండాలని తెలిపారు. రైతులు గ్రామ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

కార్గో సర్వీసులు ప్రారంభం



ధన్వాడ: మండల కేంద్రంలోని ఎస్‌ఎస్. నాయుడు అండ్ సన్స్ మీ సేవ కేంద్రంలో బుధవారం ఆర్టీసీ లాజిస్టిక్ కార్గో సర్వీసులను టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్ ఇన్‌చార్జి రాజ్‌కుమార్ ప్రారంభించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. తక్కువ సమయంలో వారి గమ్యస్థానాలకు పార్సెల్స్ డెలివరీ చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. కార్గో సేవలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రాలోని అన్ని జిల్లాలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మండలవాసులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంఈ ఆపరేషన్ రవికుమార్, నర్సింహులునాయుడు, కొండారెడ్డి, బాలయ్య, శ్రీనివాస్‌గౌడ్, ఆంజనేయులు, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు

విద్యార్థులకు దేశ స్వరూపంపై వివరణ

మద్దూరు: కొత్తపల్లి మండలంలోని నిడ్జింత ఉన్నత పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయులు భీంసేన్, నాగేష్ భారతదేశ భౌగోళిక స్వరూపంపై పాఠశాల ఆవరణలో త్రిమితీయ పటాన్ని తయారుచేసి విద్యార్థులకు బోధించారు. మనదేశంలో ఎక్కడెక్కడ అడవులు ఉన్నాయి. ఎక్కడ గుట్టలు, నదులు పారే ప్రాంతాలు, తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయుల కృషితో భారత దేశంపై విద్యార్థులకు అవగాహన కల్పించడం సంతోషదాయకమని హెచ్‌ఎం ఆంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

- స్వచ్ఛంద సంస్థచే ఐదు కంప్యూటర్ల ఏర్పాటు
- శిక్షణ పొందుతున్న బాల, బాలికలు
- హర్షం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు



శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు (ఫైల్)



ఊట్కూర్‌లో కంప్యూటర్ శిక్షణను పొందుతున్న విద్యార్థులు (ఫైల్)

ఊట్కూర్: మారుమూల గ్రామాల్లో పేద మైనార్టీ బాల, బాలికలకు కంప్యూటర్ విద్యను అందించాలనే ఉద్దేశంతో పలు స్వచ్ఛంద సంస్థలు కృషిచేస్తున్నాయి. మండల కేంద్రంలో " తాజ్ దక్కన్ ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ సొసైటీ" మహబూబ్‌నగర్ వారు కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటుచేసి బాలబాలికలకు కంప్యూటర్ విద్యను అందిస్తున్నారు. మండలంలోని ఉర్దూ మీడియం సీసీఎస్ పాఠశాల, ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాల ఉంది. స్థానిక పంచ్ మజీద్ సమీపంలో అద్దె భవనంలో 5 కంప్యూర్‌లతోపాటు కావాల్సిన ఫర్నిచర్‌ను ఏర్పాటు చేశారు. 7వ తరగతి నుంచి 10 తరగతి విద్యార్థులకు ప్రతి రోజు సాయంత్రం 5నుంచి 8గంటలవరకు కంప్యూటర్‌పై శిక్షణ ఇస్తున్నారు. బ్యాచ్‌కు 10మంది విద్యార్థుల చొప్పున 3బ్యాచ్‌లలో 30 మంది విద్యార్థులు కంప్యూటర్ విద్యను అభ్యసిస్తున్నారు. పెయింట్, వర్డ్, నోట్‌ప్యాడ్, టైపింగ్, ఎంఎస్ ఆఫీస్ వరకు శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులకు కంప్యూటర్‌లో శిక్షణ ఇచ్చేందుకు ఇన్‌స్ట్రక్టర్‌ను నియమించారు. విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందుతుండడంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్వచ్ఛంద సంస్థచే ఏర్పాటు..

"తాజ్ దక్కన్ ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ సొసైటీ" మహబూబ్‌నగర్ అధ్యక్షుడు మహ్మద్ సలీం నవాబ్ గ్రామానికి చెందిన ఖాజీం హుసేన్ సహకారంతో కంప్యూటర్ శిక్షణకేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సుమారు రూ.1లక్షల 50వేల వ్యయంతో 5 కంప్యూటర్లు, ఫర్నీచర్‌ను ఏర్పాటుచేశారు. గత నెల రోజుల క్రితం ప్రారంభించారు. ఇన్‌స్ట్రక్టర్‌ను నియమించి కంప్యూటర్ శిక్షణను అందిస్తున్నారు.

సంతోషంగా ఉంది..



మా గ్రామంలో కంప్యూటర్ శిక్షణకేంద్రం లేదు. నేర్చుకోడానికి మక్తల్, నారాయణపేట పట్టణాలకు వెళ్లాలి. ఇక్కడే ఉచితంగా కంప్యూటర్ శిక్షణ పొందుతున్నందుకు సంతోషంగా ఉంది. రోజు ఒక గంటపాటు పేయింట్, నోట్‌ప్యాడ్, టైపింగ్ నేర్చుకుంటున్నాను. కంప్యూటర్ విద్య ఉన్నత చదువులకు ఉపయోగపడుతుంది.

- మహ్మద్ ఉస్మాన్, తొమ్మిదోతరగతి, ఊట్కూర్

కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నాం..



ప్రతిరోజూ సాయంత్రం 5గంటల నుంచి 8వరకు కంప్యూర్ విద్య అందిస్తున్నాం. బ్యాచ్‌కు 10 మంది చొప్పున 3బ్యాచ్‌ల విద్యార్థులు వస్తున్నారు. పేయింట్, నోట్‌ప్యాడ్, టైపింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నాం.

- సమీర్ పాషా, ఇన్‌స్ట్రక్టర్, ఊట్కూర్

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



సైక్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న విశ్రాంత పీఈటీ గోపాలం

నర్వ: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జిల్లా సైక్లింగ్ అసోసియోషన్ ప్రధాన కార్యదర్శి విశ్రాంత పీఈటీ గోపాలం అన్నారు. బుధవారం సాయంత్రం పాథర్చేడ్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రెండు కిలోమీటర్ల సైక్లింగ్ పోటీలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, కార్యదర్శి విజయ్‌కాంతారావు ఆదేశాల మేరకు ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలతో విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి ఏర్పడుతుందన్నారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన వారికి మెడల్స్, మెమోంటోలు అందించారు. గెలుపొందిన వారు ఆగస్టు చివరి వారంలో వరంగల్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు పంపుతామన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శైలజ, పీఈటీ విష్ణువర్ధన్‌రెడ్డి, విశ్రాంత జీహెచ్‌ఎం సంజన్న, ఉపాధ్యాయులు సదన్‌రావు, కవిత, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడికి సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు, గ్రామస్తులు

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు రాంరెడ్డి పదోన్నతిపొంది బదిలీపై వెళ్లడంతో తోటి ఉపాధ్యాయులు బుధవారం సన్మానించారు. అదే విధంగా ఆ పాఠశాలకు వచ్చిన నూతన ఉపాధ్యాయులు రామకృష్ణాకు స్వాగతం పలకడంతోపాటు వారికి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శేఖర్, తిరుమలరావు, చంద్రశేఖర్, కుర్షీద, శోభరాణి, సుష్మ, కృష్ణావేణి, రుషిక, కల్యాణి, సీఆర్‌పీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి..



మక్తల్‌లో..

మక్తల్: ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని పీఆర్టీయూ నాయకులు నర్సింహారెడ్డి అన్నారు. మండలంలోని దాసర్‌దొడ్డి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు జి. గోపాల్ పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు.. గోపాల్ ఆదర్శాలను తీసుకుని విద్యార్థులు ఉన్నతంగా రాణించాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడు తిరుపతి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం అనీల్‌గౌడ్, మాజీ ఎంఈఓ లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.

పీఆర్‌సీపై ప్రభుత్వం దృష్టిసారించాలి



మార్కెట్‌లేన్ స్కూల్‌లో సభ్యత్వం చేయిస్తున్న శేర్‌కృష్ణారెడ్డి

నారాయణపేట రూరల్ : ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల పీఆర్‌సీపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి సారించాలని తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్‌కృష్ణారెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని గ్రౌండ్, గరల్స్, మార్కెట్‌లేన్, పీహెచ్‌ఈఎస్, మండలంలోని కోటకొండ, తిర్మలాపూర్ పాఠశాలలో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న పదోన్నతులు, బదిలీల ప్రక్రియ చేపట్టడం హర్షణీయమన్నారు. లెప్ట్‌వర్ వేకన్సీలను సైతం పూర్తి చేస్తున్న ప్రభుత్వం ఖాళీల స్థానంలో తాత్కాలికంగా వలంటీర్లను ఏర్పాటు చేయాలన్నారు. డీఏ, పీఆర్‌సీలను ప్రకటించి టీచర్ల ఆర్థిక ఇబ్బందులను గట్టెక్కించాలన్నారు. 317 బాధితులకు న్యాయం చేయాలని, జిల్లాలో బదిలీ ఐనా స్థానచలనం కాని టీచర్లను వెంటనే వారి కొత్త స్థానాలకు పంపాలని, అర్హత ఉండి మిగిలిపోయిన పండిత్, పీఈటీలకు పదోన్నతి కల్పించాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో జీహెచ్‌ఎంలు వేణుగోపాల్, సత్యనారాయణసింగ్, జయంత్, శ్రీనాత్‌రావు, తపస్ జిల్లా కార్యదర్శి నర్సింహ, మండల అధ్యక్ష, కార్యదర్శులు విశ్వనాథ్‌రెడ్డి, నర్సింహులు, పట్టణ అధ్యక్షులు శ్యాంప్రసాద్, చంద్రకాంత్, శ్రీనివాస్, జానకి, పర్విన్, సంధ్యరాణి, స్నేహలత, అంబరీనాథ్ పాల్గొన్నారు.

ఇంకుడుగుంతలతో భూగర్భజలాల పెంపు

కొత్తకోట రూరల్: గ్రామంలో ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవడం ద్వారా వృథాగా పోయే నీరు అందులో చేరి భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉందని ఎంపీఓ పుష్ప, పంచాయతీ కార్యదర్శి జయమ్మ అవగాహన కల్పించారు. పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లిలో బుధవారం నిర్వహించిన గ్రామసభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీఓ మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్య పనులు నిరంతరం చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలో తాగునీటి సమస్య, దోమలు, ఈగల బెడద ఎక్కువగా ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. డ్రై డే కార్యక్రమం చేపట్టడంలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను వేగంగా పరిష్కరించి, ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరారు. శ్రీశైలం, రఘుగౌడ్, భీంరెడ్డి, కృష్ణ, ఆనంద్, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఖబ్రస్తాన్‌ను పరిశీలన

ఆత్మకూర్: పట్టణంలోని ముస్లింల ఖబ్రస్తాన్ (శ్మశానవాటిక)లో సమాధులు ధ్వంసం చేసిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ముస్లిం సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ సిరాజ్‌పాష బృందం ఖబ్రస్తాన్‌ను సందర్శించి ధ్వంసమైన సమాధులను పరిశీలించారు. ఘటన జరిగి పక్షం రోజులు అవుతున్నా పోలీసులు, అధికారులు విచారణ చేపట్టడం లేదని స్థానిక ముస్లింలు వారి దృష్టికి తీసుకెళ్లారు. వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ సిరాజ్‌పాష స్థానికులతో కలిసి తహసీల్దార్ రాజు, ఎస్‌ఐ నరేందర్‌తో కేసు పురోగతిని తెలుసుకున్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గయాసుద్దీన్, షాహీద్, ఇమ్రాన్, వాహేద్, ఉస్మాన్, నిరంజన్, ఫిరోజ్, యువకులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు సరికాదు



నారాయణపేట: సమస్యలు పరిష్కరించాలని గత కొంతకాలంగా ఆందోళన చేస్తున్న మధ్యాహ్నభోజన కార్మికులను హైదరాబాద్ ధర్నాకు వెళ్తున్నారని నేపథ్యంలో బుధవారం స్థానిక పోలీసులు అరెస్టుచేసి పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించడం సరికాదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం విమర్శించారు. ఎనిమిది నెలలుగా మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, పెంచిన అరకొర వేతనం దాదాపుగా 13నెలలుగా పెండింగ్‌లో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేసినా మధ్యాహ్నభోజన కార్మికులను సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేశారన్నారు.

ఓయూ విద్యార్థి అరెస్టు

కృష్ణా: విద్యా రంగానికి ప్రభుత్వం 30శాతం నిధులు కేటాయించాలని, జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బుధవారం చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని వామపక్ష విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. దీంతో స్థానిక పోలీసులు ఓయూ విద్యార్థి పీడీఎస్‌యూ నాయకుడు కున్సి భీమ్‌తోపాటు మరికొందరిని ముందస్తుగా అరెస్టుచేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు.. పీడీఎస్‌యూ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం తక్షణమే ఉద్యోగ నియమాకాలు చేపట్టాలని డిమాండ్ చేశాడు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు.

బాధితుడికి ఆర్థిక సాయం



ఊట్కూరు: మండలంలోని శ్రీరాంనగర్ వీధికి చెందిన క్యాన్సర్ బాధితుడు మేస్త్రీ నర్సింహులుకు పి. రామకృష్ణ ఉపాధ్యాయుడు బుధవారం 5వేల ఆర్థికసాయం అందించాడు. బాధితుడు గతకొన్ని రోజులుగా క్యాన్సర్ బారిన పడి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న ఉపాధ్యాయుడు నగదును వారి కుటుంబ సభ్యులకు అందించారు. ఆర్థిక సాయం అందించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

మాగనూర్: మండల పరిధిలోని వడ్వాట్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని బుధవారం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బొప్పలి వెంకటేష్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎనుకున్నారు. ఈ మేరకు.. గ్రామ అధ్యక్షుడిగా డీలర్ హన్మంతు, ఉపాధ్యక్షుడిగా పల్లె అంజప్ప, కో–శాధికారిగా ఎర్ర తాయప్ప, యూత్ అధ్యక్షుడిగా లక్ష్మప్పతోపాటు మరో పదిహేను మంది సభ్యులతో నూతన గ్రామకమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. వారు మాట్లాడుతూ.. మాదిగల హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో వర్గీకరణ చేస్తామని చెప్పిమాట తప్పిన మోదీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దూల తాయప్ప, తాండురు కిష్టప్ప, లక్ష్మప్ప, కోట కిష్టప్ప, ఆశప్ప పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



సూచికబోర్డు లేని రోడ్డు..

ప్రమాదకరంగా మలుపు..

మాగనూర్ మండలంలోని మందిపల్లి సమీపంలో ప్రధాన రహదారి మలుపు ప్రమాదకరంగా ఉంది. ఈ రోడ్డు గుండా ఆయా గ్రామాల ప్రజలు నిత్యం ప్రయాణం సాగిస్తుంటారు. ఈ రోడ్డుపై ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు రాత్రి వేళల్లో మలుపును గుర్తించక కింద పడి గాయాలపాలైన ఘటనలు చోటుచేసుకున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సూచిక బోర్డుతో పాటు స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

- మాగనూర్

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



తిర్మలాపూర్‌లో మాట్లాడుతున్న ఏఎస్‌ఐ బాలయ్య



మాగనూర్‌లో అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారులు



దామరగిద్దలో..

నారాయణపేట రూరల్: రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి పౌరుడు తెలుసుకుని ఉండాలని ఏఎస్‌ఐ బాలయ్య అన్నారు. ప్రతి నెల ఆఖరిరోజు జిల్లాలో సివిల్‌రైట్స్ డే నిర్వహించాలనే ఆదేశాలతో జిల్లాలోని ప్రతి పీఎస్ పరిధిలో ఒక గ్రామం ఎంపిక చేసి బుధవారం కార్యక్రమం చేపట్టారు. ఈమేరకు మండలంలోని తిర్మలాపూర్‌లో రూరల్ పీఎస్ బృందం ప్రజలను చైతన్యపరిచారు. ఈ మేరకు.. వివిధ శాఖల అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొని మాట్లాడారు. ప్రతి పౌరుడికి సమానత్వం, స్వేచ్ఛగా జీవించే అవకాశాన్ని రాజ్యాంగం కల్పించిందన్నారు. బీద, ధనిక తేడా లేకుండా అందరు సమానంగా సేవలను పొందవచ్చని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

స్నేహభావంతో మెలగాలి

మాగనూర్: గ్రామంలో స్నేహభావంతో కలిసిమెలసి ఉండాలని రెవెన్యూ ఆర్‌ఐ శ్రీశైలం అన్నారు. మండల పరిధిలోని కొల్పూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో బుధవారం పౌరహక్కుల దినం సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో రెండు గ్లాసుల పద్ధతి సోదరభావంతో మెలగాలని సూచించారు, కుల వివక్షత చూపకుండా కలిసికట్టుగా ఉండాలని సూచించారు. అదేవిధంగా రాజ్యాంగం కల్పించిన హక్కులను వివరించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్‌ఐ శ్రీశైలం, పోలీసు సిబ్బంది అర్జున్, నర్సింహులు తదితరుల పాల్గొన్నారు.

మరికల్: కులాల పేరుతో దూషించుకోకుండా అందరు కలిసిమెలిసి ఉండాలని ఆర్‌ఐ శ్రీశైలం అన్నారు. మండలంలోని కన్మనూర్‌లో బుధవారం సివిల్ రైట్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని హోటళ్ల వద్ద రెండుగ్లాసుల పద్ధతి పెట్టొద్దన్నారు. దీంతోపాటు ఆలయంలో అందరు పూజలు చేసుకునేల స్వేచ్ఛవాతావరణం ఉండాలని సూచించారు. పై నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దామరగిద్ద: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్‌ఐ రాజు సమక్షంలో బుధవారం పోలీసులు అవగాహన కల్పించారు. చదువుకునే వయస్సున్న చిన్నారులను పనికి పంపొద్దని బడికి పంపాలన్నారు. బాల్యవివాహాలను చేయొద్దని, వాహనం నడిపే టప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. రోడ్డు భద్రత నియమాలు పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండాలని తెలియాపారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ అరుస్, కానిస్టేబుల్స్ మోనప్ప, మైబు, బుగ్గప్ప పాల్గొన్నారు.

'చలో అసెంబ్లీ' వాల్‌పోస్టర్ విడుదల



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

ఊట్కూరు: సీపీఐఎంఎల్ ఆధ్వర్యంలో ఈ నెల21న చేపట్టిన చలో అసెంబ్లీని విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం బిజ్వార్‌లో వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ మేరకు.. సీపీఐఎంఎల్ మాస్‌లైన్ డివిజనల్ కార్యదర్శి సలీం మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాల అమలుకోసం ఆగస్టు 1న తహసీల్దార్, ఆగస్టు 8న కలెక్టర్ కార్యాలయం, 21 చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. పేద ప్రజలు రేషన్‌కార్డులు, కొత్త పెన్షన్‌లు, ఇండ్ల స్థలాలు తదితర వివిధ సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని ఆయన తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలతో పాటు అనేక సమస్యలను పరిష్కరిస్తామని మ్యానిఫెస్టోలో తెలియజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కిరణ్, భగవంత్ తదితరులు పాల్గొన్నారు.

పేదల వ్యతిరేక బడ్జెట్‌ను సవరించాలి



నిరసన తెలియజేస్తున్న నాయకులు

దామరగిద్ద: పేదల రైతు వ్యతిరేకంగా ఉన్న కేంద్ర బడ్జెట్‌ను వెంటనే సవరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ కెటాయింపులపై నిరసన వ్యక్తం చేశారు. పేదలను రైతులను పూర్తిగా విస్మరించిందన్నారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా బడ్జెట్‌ను కెటాయించిన కేంద్ర ప్రభుత్వం వెంటనే బడ్జెట్‌ను సవరించాలన్నారు. 48 లక్షల కోట్ల బడ్జెట్‌లో రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులు బయ్యారం ఉక్కు పరిశ్రమ అభివృద్ధికి బడ్జెట్‌లో ఒక్క రూపాయి నిధులు కేటాయించలేదన్నారు. వెంటనే బడ్జెట్‌ను సవరించి రైతాంగ అభివృద్ధికి పెద్ద పీటవేయాలన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు జోషి, శివకుమార్, హన్మంతు, మల్లేష్ అశోక్, బుగ్గప్ప, నారాయణ, నర్సింహులు పాల్గొన్నారు.

నిబంధనలు లేకుండా మాఫీచేయాలి



భూనీడ్‌లో కరపత్రం అవిష్కరిస్తున్న మాస్‌లైన్ నాయకులు



దామరగిద్దలో..

మద్దూరు: రేషన్‌కార్డు ప్రతిపాదికన లేకుండా రుణమాఫీ చేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కొత్తపల్లి మండలంలోని భూనీడ్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తూ కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ మేరకు.. మాస్ లైన్ జిల్లా కార్యవర్గ సభ్యుడు యాదగిరి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలు ఆరు గ్యారంటీల అమలుతో పాటు కొత్త పింఛన్లు, ఇళ్లస్థలాలు, కొత్తరేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారని వాటిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా పాలన అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం నేటికి వీటి ఊసేఎత్తడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో మాస్‌లైన్ నాయకులు నర్సింహులు, కొండన్న, కిష్టప్ప, రాములు, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

దామరగిద్ద: ప్రభుత్వం రుణమాఫీకి నిబంధనలు విధించకుండా ప్రతి ఒక్కరికి వర్తింపజేయాలని సీపీఎం (ఎంఎల్) నాయకులు కాశినాథ్, సాయి అన్నారు. ప్రభుత్వం రేషన్‌కార్డు నిబంధనతో అర్హులైన వారికి రైతులకు రుణమాఫీ కా వడం లేదన్నారు. బ్యాంకర్లు లోన్ రెన్యూవల్ పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దన్నారు. కార్యక్రమంలో నాయకులు రైతులు పాల్గొన్నారు

మరికల్: రెండు విడతలుగా మాఫీచేసిన రుణమాఫీ సక్రమంగా జరగలేదని బీజేపీ మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ అన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మొదటి, రెండో విడతలో పంటల రుణాల మాఫీ విషయంలో కొంతమందికి మాఫీ కాకపోవడంతో రైతులు వ్యవసాయశాఖ అధికారులు, బ్యాంకుల చుట్టు తిరుగుతున్నారన్నారు. వెంటనే అధికారులు స్పందించి రెండు విడతల్లో రుణాలు మాఫీకాని రైతుల వివరాలను మరోసారి ప్రభుత్వానికి పంపించాలని డిమాండ్ చేశారు.